సాక్షి నంద్యాల

ఆదివారం । 12 । మార్చి । 2023



వెండినగలు పట్టివేత

కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎలాంటి బిల్లులు లేని 37.750 కిలోల వెండి కాళ్ల పట్టీలు బయటపడ్డాయి. వీటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. 8లో▸



వైభవంగా స్వాతి వేడుకలు

అహోబిల క్షేత్రంలో శనివారం స్వాతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. 8లో▸

ఉష్ణోగ్రతలు

కనిష్టం	19.4
గరిష్టం	36.0

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య ఆలయానికి రూ. 4 లక్షల విరాళం

బేతంచెర్ల: జిల్లాలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహ ఆలయంలో గర్భగుడి పునర్నిర్మాణానికి దాతలు రూ. 4 లక్షల విరాళం అందజేశారు. ఓర్వకల్లు మండలం కాలువ హుసేనాపురం గ్రామానికి చెందిన గాజ నాగిరెడ్డి భార్య అచ్చమ్మ జ్ఞాపకార్థం కుమారుడు గాలన్న, కోడలు అయ్యమ్మ రూ. 4 లక్షల విరాళాన్ని శనివారం ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడుకు అందజేశారు.

గోరుముద్దలో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

ఆళ్లగడ్డ: జగనన్న గోరుముద్దలో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులు, మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో బోర్డు పై రాయించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంఈఓ శోభావివేకవతి ఉన్నారు.

హజ్‌యాత్రకు దరఖాస్తు గడువు పెంపు

నంద్యాల(వ్యవసాయం): హజ్‌యాత్ర దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ వరకు పెంచినట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు, శాసన మండలి సభ్యులు ఇసాక్‌బాషా, జిల్లా హజ్ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ ఇంతియాజ్ అహమ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది మన దేశం నుంచి వెళ్లే వారి కోటాను లక్ష నుంచి 1.70 లక్షల మందికి పెంచడం జరిగింది. దానికి అనుగుణంగా రాష్ట్రం వాటా కూడా పెరుగుతుందన్నారు. 70 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు లాటరీ లేకుండా నేరుగా ఒక సహాయకుడితో పాటు హజ్‌యాత్రకు వెళ్లవచ్చునన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేషనల్ డిగ్రీ కళాశాలలోని ఉచిత హజ్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు నోటీసులు

కర్నూలు సిటీ: ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లలో బైజూస్ యాప్ డౌన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన 528 మంది టీచర్లకు డీఈఓ డాక్టర్ వెంకట రంగారెడ్డి శనివారం నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసి మూడు నెలలు అవుతున్నా ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రెండు రోజుల్లో బైజూస్ యాప్ డౌన్‌లోడ్ చేసి యాక్టివ్ చేసుకోకపోతే సంబంధిత టీచర్లను సస్పెండ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- రేపు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్
- జిల్లా వ్యాప్తంగా 94 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ నిర్వహణకు 473 మంది అధికారుల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఆర్వో పుల్లయ్య

నంద్యాల: జిల్లాలో ఈనెల 13వ తేదీన జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 16వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు. జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 54,929 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 4,426 మంది, స్థానిక సంస్థల ఓటర్లు 578 మంది ఉన్నారు. ఇందుకు సంబంధించిన ఓటర్ల స్లిప్పులను ఓటర్లకు 98 శాతం పంపిణీ చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే పోలింగ్ అధికారులకు రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి వసతి, ప్రాథమిక వైద్య చికిత్స సదుపాయాలతో పాటు, క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పోలింగ్ ప్రక్రియ సమాచారం తెలుసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళి, ఓటింగ్ నమోదు తదితర అంశాలను ప్రతి 2 గంటలకు ఓ సారి ఇక్కడి నుంచే అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు.

9 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మొత్తం జిల్లాలో 91 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో పట్టభద్రులకు సంబంధించి 61, ఉపాధ్యాయలకు 30, స్థానిక సంస్థల పోలింగ్ కేంద్రాలు 3 ఏర్పాటు చేశారు. వీటిలో 9 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. పోలింగ్‌కు 117 బ్యాలెట్ పెట్టెలు అవసరం ఉండగా వాటిని సిద్ధం చేసి నంబరింగ్ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణకు 473 మంది పోలింగ్ అధికారులను నియమించారు. ఇందులో పీఓలు 118, ఏపీఓలు 118, ఓపీఓస్ 237 మంది, మైక్రో అబ్జర్వర్స్ 118 మందిని నియమించారు.

నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ..

పోలింగ్ బాక్స్‌లను నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయాల్లో ఉంచారు. వీటిని ఆదివారం ఉదయం సంబంధిత ఎన్నికల అధికారులు తమ పోలింగ్ కేంద్రాలకు తీసుకొని వెళ్లనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం, పోలింగ్ అనంతరం ఆర్‌డీఓ కార్యాలయాలకు తీసుకొచ్చేందుకు 34 ఆర్టీసీ బస్సులను కేటాయించారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగనుంది. పోలింగ్ కేంద్రాల నుంచి ఎన్నికల ప్రక్రియ జిల్లా కలెక్టర్ కార్యాలయం, రాష్ట్ర ఎన్నికల కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. అలాగే ఓటింగ్ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయనున్నారు. ఎన్నికల్లో 11 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. అందులో ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఉద్యోగులకు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్‌లు నియోజకవర్గంలో విద్యాసంస్థలు జారీ చేసే గుర్తింపు కార్డు, డిగ్రీ, డిప్లొమో ఒరిజినల్ సర్టిఫికెట్లు, వికలాంగుల ధ్రువీకరణ పత్రం కార్డులో ఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై కలెక్టర్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మకంగా గుర్తించిన 9 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు వీడియో గ్రాఫర్లతో వీడియోగ్రఫీని తీయిస్తున్నట్లు వివరించారు. పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించేందుకు 118 మంది మైక్రో పరిశీలకులకు సంపూర్ణ శిక్షణ ఇచ్చి నియమించామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్టంగా అమలు పరిచేందుకు 29 మండలాల్లో ఎంసీసీ స్క్వాడ్‌లను నియమించి నిఘా ఉంచామన్నారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నియమాలను పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు ఎవరూ గుంపులుగా ఉండరాదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల నియమాలను, రిటర్నింగ్ అధికారి సూచనలు తప్పక పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 590 మంది పోలీసు సిబ్బందిని నియమించామన్నారు.

ఎన్నికల నిబంధనలు ఇలా..

- అభ్యర్థులు, ఏజెంట్లు, ఓటర్లు ఎన్నికల నిబంధనలను తప్పని సరిగా పాటించాలి.
- మొబైల్ ఫోన్లు, ఐపాడ్, ట్యాబ్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లకూడదు.
- పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా గుమ్మిగూడరాదు.
- అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఎలాంటి చర్యలకు పాల్పడరాదు.
- ఎన్నికల సందర్భంగా రెచ్చగొట్టె చర్యలకు పాల్పడరాదు.
- పోలింగ్ బూత్, లోపల ఫొటోలు తీయరాదు.



పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు సమాచారం ఉంటే ఎన్నికల కమిషన్, స్థానిక పోలీసులు, డయల్ 100కు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటారు.

ఘనంగా సుయతీంద్రతీర్థుల పూర్వారాధన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల పూర్వారాధన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జ్ఞానయజ్ఞ మంటపంలో జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అంకురార్పణ పలికారు. ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనానికి, మూల, జయ, దిగ్విజయ రాములకు సంస్థాన పూజలు చేపట్టారు. అనంతరం సుయతీంద్రతీర్థుల మూల బృందావనానికి అభిషేకం, పుష్పాలంకరణతో విశేష పూజలు జరిపారు. పండితులతో చేపట్టిన ప్రవచనాలు, హరికథామృతసార పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రూ.లక్ష విరాళం

శ్రీమఠం నేతృత్వంలో నిర్వహిస్తున్న గోశాల నిర్వహణకు బెంగళూరుకు చెందిన హరిమూర్తి అనే భక్తుడు రూ.లక్ష విరాళంగా అందజేశారు. శేష వస్త్రం, దుశ్శాలువ, ఫల మంత్రాక్షింతలతో దాతను పీఠాధిపతి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక సహాయక అధికారులు వ్యాసరాజాచార్, బిందు మాధవ, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

ఆర్‌యూలో అక్రమాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించండి

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాలపై జ్యుడీషియల్ విచారణ జరపాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్ ఈనెల 4వ తేదీన ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాశారు. ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. వర్సిటీ గతంలో ఎస్కే యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్‌గా ఉండేది. ఆ సమయం నుంచి వర్సిటీగా ఏర్పాటయ్యేంతవరకు ఎలాంటి అనుమతులు లేకుండగా నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేసినట్లు ఉన్నత విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. నకిలీ సర్టిఫికెట్లతో పలువురు వర్సిటీలో ఉద్యోగాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులపై పది రోజుల్లో విచారణ చేసి నివేదిక అందజేయాలని 2021 అక్టోబర్ 25వ తేదీన ఉన్నత విద్యాశాఖ ఆర్‌యూ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జా రీ చేసింది. అయితే వర్సిటీ అధికారుల నుంచి స్పంద న లేకపోవడంతో 2021 డిసెంబర్ 15వ తేదీన ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, ఏపీ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. విచారణకు అడ్డంకులు ఏర్పడుతుండడంతో జ్యుడీషియల్ విచారణకు రిటైర్డ్ హైకోర్టు జడ్జిని నియమించాలని కోరుతూ రాష్ట్ర ఉన్న త విద్యామండలి సెక్రటరీ లేఖ రాశారు.

రేపు పాఠశాలలకు సెలవు

కర్నూలు (సిటీ): పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో రేపు(సోమవారం) అన్ని యాజమాన్యాలకు చెందిన స్కూళ్లకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ డాక్టర్ వెంకటరంగారెడ్డి శనివారం తెలిపారు. మొదటగా ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటైన స్కూళ్లకు మాత్రమే సెలవు ప్రకటించారు. ఆ తర్వాత అన్ని ప్రాంతాల నుంచి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల మేరకు పాఠశాల విద్యాశాఖ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళాలు



దాతలకు విరాళానికి సంబంధించి బాండును అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం గుంతకల్‌కు చెందిన వీరేష్ రూ.1,47,400, నెల్లూరుకు చెందిన శశిధర్ శ్రీనివాస్ రూ.లక్ష విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

ఈ- క్రాప్ నమోదు సవరణకు అవకాశం

నంద్యాల(అర్బన్): రబీలో ఈ క్రాప్ నమోదు సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీ కోసం పంట ముసాయిదా జాబితాను ఆర్బీకేల్లో ఈనెల 17 వరకు ప్రదర్శిస్తున్నామన్నారు. మార్పులు, చేర్పుల అనంతరం తుది జాబితాను ఈనెల 20న ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. అప్పటిలోగా ఏవైన అభ్యంతరాలు ఉంటే ఆర్‌బీకేల్లోని వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలకు రాత పూర్వకంగా ఇవ్వాలన్నారు.

ఇంటర్, పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులను ఆదేశించిన సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): మార్చి 15 నుంచి 29వ తేదీ వరకు ఇంటర్, ఏప్రిల్ 3 నుంచి 15వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో కనీస వసతులైన మంచినీరు, నిరంతరం విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దు అని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసరమైన వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ డి.ప్రసాద్, డీఆర్‌ఓ ఎస్వీ నాగేశ్వరరావు, నగర పాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ రమాదేవి, డీఎస్పీ ఎస్‌కే మహేష్, ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి, డీవీఈఓ జమీర్‌పాషా, డీఈఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

నిధులున్నా.. నీరసమే!

19 రోజుల్లో ఖర్చు చేయాల్సిన మొత్తం రూ.45 కోట్లు

- వినియోగించుకోకపోతే నిధులు వృథా
- ఈ ఆర్థిక సంవత్సరం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.142.67 కోట్లు
- వినియోగించిన నిధులు రూ.98.78 కోట్లు
- జిల్లా అభివృద్ధిలో ఉపాధి నిధులే కీలకం
- పూర్తి స్థాయి వినియోగంపై జిల్లా యంత్రాంగం దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): 2022–23 ఆర్థిక సంవత్సరం ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. ఈలోపు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంటు కింద వివిధ అభివృద్ధి పనులకు రూ.46 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. వినియోగించలేకపోతే నిధులు ల్యాప్స్(వృథా) కానున్నాయి. ప్రస్తుతం మెటీరియల్ కాంపోనెంటు నిధులు 100 శాతం ఖర్చు చేయడంపై జిల్లా యంత్రాగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ కింద వినియోగించిన లేబర్ బడ్జెట్‌లో 66 శాతం మెటీరియల్ కాంపోనెంటు కింద వివిధ అభివృద్ధి పనులకు వినియోగించవచ్చు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీపథకం లేబర్ కాంపోనెంటు కింద జిల్లాలోని 25 మండలాల్లో ఈ నెల 10వ తేదీ నాటికి రూ.189.02 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో 66 శాతం ఉపాధి నిధులను అభివృద్ధి పనులు చేపట్టేందుకు మెటీరియల్ కింద ఖర్చు చేయవచ్చు. ఈ ప్రకారం రూ.126.01 కోట్లు ఉపాధి నిధులు జిల్లా యూనిట్‌గా ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. ఈ నెల చివరి వరకు ఉపాధి పనులు జరిగితే లేబర్ వేజ్ కింద రూ.214.02 కోట్లు ఖర్చు చేసే వీలుంది.



దేవనకొండ మండలం తెర్నేకల్‌లో ఉపాధి నిధులతో నిర్మించిన ప్రభుత్వ భవనం

మెటీరియల్ కాంపోనెంటు కింద అభివృద్ధి పనులు ఇలా..

- ప్రియారిటీ భవనాల కింద గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తున్నారు.
- సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌లు, కాంపౌండ్ వాల్స్ తదితర పనులు. • రైతుల స్థిరాస్తి అభివృద్ధిలో భాగంగా పండ్లతోటలకు పెద్దపీట.

రూ.96.78 కోట్లు మాత్రమే వ్యయం

2022–23 ఆర్థిక సంవత్సరంలో మార్చి నెల చివరి వరకు మెటీరియల్ కింద రూ.142 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు రూ.96.78 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ నెల చివరిలోపు రూ.45 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. మెటీరియల్ కాంపోనెంటు నిధులను పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా వినియోగిస్తున్నారు. ఈ విభాగాల అధికారులు నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

“ పూర్తి స్థాయిలో నిధులు ఖర్చు చేసేలా చర్యలు



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులు ల్యాప్స్ కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. మెటీరియల్ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. పనులు వేగవంతం చేసి మెటీరియల్ నిధులను పూర్తిగా వినియోగించేలా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నాం. ఎంబుక్‌లో రికార్డు చేస్తే చాలు.. నిధులు కాస్త ఆలస్యంగానైన విడుదలవుతాయి.

– అమరనాథరెడ్డి, పీడీ డ్వామా

క్లుప్తంగా

మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

- అధ్యక్ష, కార్యదర్శులుగా దేవికా రాణి, సుచరిత



మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కర్నూలు: జిల్లా ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డు సెక్రటేరియట్ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటయ్యింది. విజయవాడలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అన్ని జిల్లాల మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఏపీ విలేజ్ అండ్ వార్డు సెక్రటేరియట్ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను అధికారికంగా ప్రకటించారు. అసోసియేషన్‌కు జిల్లా అధ్యక్షురాలిగా దేవికా రాణి, కార్యదర్శిగా సుచరితను రాష్ట్ర కమిటీ ప్రకటించింది. అలాగే జిల్లా ఉపాధ్యక్షురాలిగా జ్యోత్స్న రాణి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పద్మాబాయి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆస్మా జాబిన్, కోశాధికారిగా ఖాజాబీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా త్రివేణి, జాయింట్ సెక్రటరీలుగా లక్ష్మీ దేవిబాయి, రూపాదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రమాదేవి, జహరున్నీసా బేగం, ఎం.షబానా పర్వీన్, సీహెచ్ లచ్చమ్మ, జి.లలితమ్మ, వై.శ్రీలక్ష్మీ ఎస్.చంద్రకళలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- విద్యుత్ శాఖలో సర్కిల్‌డే సంబరాలు ప్రారంభం



విద్యుత్ సర్కిల్ డే వేడుకలను ప్రారంభిస్తున్న అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. కర్నూలు సర్కిల్‌డే వేడుకలు స్థానిక విద్యుత్ భవన్ ఆవరణంలో శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విధి నిర్వహణలో ఉండే అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు మానసిక ఉల్లాసం కోసం ఆటవిడుపు అవసరమన్నారు. అనంతరం డైరెక్టర్ శశికళ, రిటైర్డు డైరెక్టర్ పి. పుల్లారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు పని ఒత్తిడి నుంచి బయట పడేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి మాట్లాడుతూ ఆట పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉద్యోగులు కుటుంబ సమేతంగా పాల్గొనవచ్చన్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఉన్నతాధికారులు హాజరు కానున్నారని, ఆ రోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ట్రాన్స్‌కో ఎస్ఈలు రామకృష్ణ, కృష్ణకుమార్, కమర్షియల్ జీఎం రామచంద్రరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు రమేష్, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాహిరి..లాహిరి..లాహిరిలో

- వైభవోపేతంగా ముగిసిన లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం



ఉత్సవమూర్తులు



కోనేరులో తెప్పోత్సవ దృశ్యం

ఆళ్లగడ్డ: "లాహిరి లాహిరి లాహిరిలో... ఓహో జగమే ఊయలగా.." అంటూ ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో పడవలో విహరించారు. జయ జయ నారసింహ నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. దేదీప్యమానమైన విద్యుద్దీపకాంతుల వెలుగులో.. వేద పండితుల వేదోక్త మంత్ర పఠనములు.. ఆస్థాన విద్వాంసుల మంగళకరమైన వాయిద్యాల నడుమ మూడు రోజులు గా అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ నృసింహుడి తెప్పోత్సవ వేడుక శనివారంతో వైభవంగా ముగిసింది. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి, శ్రీప్రహ్లాదవరదుడిని పల్లకీపై కొలువుంచి మాడ వీధుల్లో ఊరేగిస్తూ కోనేటి వరకు తోడ్కొని వచ్చారు. ఉభయ దేవేరులతో స్వామి తెప్పను అధిరోహించిన అనంతరం వేదపండితుల పూజలు నిర్వహించారు. భక్తులు నరసింహ స్వామి కీర్తనలు భక్తిపారవశ్యంతో ఆలపిస్తుండగా ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో తెప్పపై ఊరేగారు. కోనేటి చుట్టూ భక్తులు చేరుకుని కార్యక్రమాన్ని వీక్షించి స్వామి ఆశీస్సులు అందుకున్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అహోబిల క్షేత్రంలో శనివారం స్వాతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రనరసింహస్వామిని కొలువుంచారు. అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వాతి, సుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



చింతలాయిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. బెలుం, యర్రగుడి, తిమ్మనాయినపేట, అబ్దులాపురం, చింతలాయిపల్లె, అంకిరెడ్డిపల్లె, గోర్విమానుపల్లె, పెట్నికోటతో పాటు కొలిమిగుండ్లలోని పాఠశాలల్లో ఆయన శనివారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని, ఓటు వేసే ముందు ఆలోచించి మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని ఉపాధ్యాయులు, పట్టభద్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, తోళ్లమడుగు, నందిపాడు సర్పంచ్‌లు మొలక రాజారెడ్డి, గుర్విరెడ్డి, నాయకులు పేరం నందకిషోర్‌రెడ్డి, బీగాల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

డాక్టర్ హల్‌చల్

- మద్యం మత్తులో రహదారి విస్తరణ పనులను అడ్డుకున్న వైనం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



పనులను అడ్డుకుంటున్న డాక్టర్ మహేశ్వరరెడ్డి

డోన్: ప్యాపిలి మండలం జలదుర్గం పీహెచ్‌సీ ప్రభుత్వ కంటి వైద్యసహాయకులు డాక్టర్ పుట్లూరు మహేశ్వరరెడ్డి శనివారం మద్యం మత్తులో డోన్ పట్టణంలో హల్‌చల్ చేశారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనులను అడ్డుకొని వీరంగం సృష్టించారు. అక్కడ ఉన్న కాంట్రాక్టర్, అతని అనుచరులను అసభ్య పదజాలంతో దూషించారు. స్థానికులు వారించే ప్రయత్నం చేయగా వారిపై కూడా మహేశ్వరరెడ్డి చేయి చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డాక్టర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఒక ఏఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడికి యత్నించాడు. వివాదస్పదమైన వ్యక్తి అయిన డాక్టర్ మహేశ్వరరెడ్డి గతంలో ఓ డాక్టర్‌ను దూషించి, దాడికి యత్నించగా..కొంతమంది రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని రాజీ కుదర్చడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయంపై ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. డాక్టర్ మహేశ్వరరెడ్డి ఇంకా మద్యం మత్తులో ఉండటంతో విచారించలేదని, మున్సిపల్ అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉండటంతో ఈ ఘటనపై ఫిర్యాదు చేయలేదన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్



మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక సంక్షేమభవన్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటర్వెల్ సమయంలో ప్రతి విద్యార్థి తప్పక మంచినీరు తాగేలా అన్ని విద్యా సంస్థల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎండల వల్ల జలుబు, దగ్గు, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని.. విద్యార్థులెవరైనా అనారోగ్యాలకు గురైతే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్యం అందించాలన్నారు. రక్తహీనత విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వైద్యుల సలహా మేరకు మందులను వాడాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో గిరిజన విద్యా సంస్థల్లోని విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ గుర్రప్ప, వసతి గృహ సంక్షేమాధికారులు అహోబిలేసు, సుప్రజ, శివక్రిష్ణలు హాజరయ్యారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయురాలి మృతి



చంద్రలీల (ఫైల్)

కోసిగి: స్థానిక ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు చంద్రలీల (59) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆరోగ్యం బాగాలేదని శుక్రవారం ఆమె సెలవు పెట్టారు. స్థానిక ప్రైవేట్ వైద్య శాలలో పరీక్షలు చేయించుకున్నారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల విద్యాధికారి మొయినుద్దీన్, కౌతాళం ఎంఈఓ ఆంజనేయులు, జేబీఎం స్కూల్ హెచ్ఎం రాజమౌళి, కొల్మాన్‌పేట జ్ఞానేష్, ఆదిఆంధ్ర పాఠశాల ఉపాధ్యాయులు ఆమె మృతికి సంతాపం తెలిపారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు



ఎమ్ఎస్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

బొమ్మలసత్రం: ప్రజలకు సేవలందించటంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్, ఎమ్ఎస్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు వారు 4 లక్షల మంది ఉన్నారని, వారందరికీ మాత్రలు చేరేలా చూడాలని ఆదేశించామన్నారు. ఆయన వెంట వైద్యులు కాంతారావునాయక్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రూ.25 లక్షల విలువైన వెండినగలు పట్టివేత

- బిల్లులు లేకుండా తమిళనాడు నుంచి నంద్యాలకు రవాణా



స్వాధీనం చేసుకున్న వెండి పట్టీలను మీడియాకు చూపుతున్న సీఐ శంకరయ్య

కర్నూలు: కర్నూలు కొత్తబస్టాండ్‌లో పోలీసు తనిఖీల్లో భారీగా వెండి నగలు పట్టుబడ్డాయి. ఈనెల 13వ తేదీన జరగనున్న శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు నాల్గవ పట్టణ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున కర్నూలు కొత్తబస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఐదు ప్లాస్టిక్ కవర్లతో(లగేజి బ్యాగులు) ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. సోదాలు నిర్వహించగా ఎలాంటి బిల్లులు లేని రూ.25 లక్షల విలువ చేసే 37.750 కిలోల వెండి కాళ్ల పట్టీలు బయటపడ్డాయి. వీటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి వివరాలు ఆరా తీయగా తమిళనాడు రాష్ట్రం సేలం పట్టణానికి చెందిన కుమార్ జ్యువెలర్స్ దుకాణం యజమాని ఎస్.జి.కుమార్ చెప్పిన ప్రకారం వాటిని నంద్యాలలోని ఓ జ్యువెలర్ దుకాణానికి తీసుకువెళ్తున్నట్లు గుమస్తా బాబు తెలిపాడు. బెంగళూరు నుంచి కర్నూలుకు వచ్చి నంద్యాలకు వెళ్లడానికి బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని బంగారు దుకాణాలకు ఎలాంటి ప్రభుత్వ బిల్లులు లేకుండానే నగలను సరఫరా చేస్తున్నట్లు అతను అంగీకరించాడు. దీంతో తదుపరి చర్యల నిమిత్తం వెండి పట్టీలను సీజ్ చేసినట్లు నాల్గవ పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ రామయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



డోన్ రూరల్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్టేషన్ సమీపంలో ఐదు అడుగుల ఎత్తు ఉండి, ఎర్రని చొక్కా, గీత పంచ ధరించిన వ్యక్తి రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నాడు. పక్కనే రెండు పెద్ద రాళ్లు పడి ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు తలపై మోది హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరాములు తెలిపారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలన్నారు.

నంద్యాలలో చోరీ

బొమ్మలసత్రం: తమ్ముడు మృతి చెందటంతో కర్మకాండ నిర్వహించేందుకు స్వగ్రామానికి వెళ్లిన వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నంద్యాల పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక స్థానిక ఎమ్ఎస్ నగర్‌లో కొంత కాలంగా అన్నదమ్ముళ్లు రామకృష్ణగౌడ్, రమేష్ నివాసముంటున్నారు. ఇటీవల తమ్ముడు రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కర్మకాండ పనుల మీద అన్న రామకృష్ణ గౌడ్ గురువారం రాత్రి కుటుంబీకులతో కలసి బనగానపల్లెకు వెళ్లాడు. కార్యక్రమం ముగించుకుని శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. తాళం తెరిచి చూడగా ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడేసి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వంటగది వెంటిలేటర్ నుంచి దొంగలు ఇంట్లోకి దూకి బీరువాలోని 15 తులాల బంగారు ఆభరణాలు, 4 లక్షల నగదు ఆపహరించారు. రామకృష్ణగౌడ్ త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

రంపపు మిషన్ తగలి..

గూడూరు రూరల్: ప్రమాదవశాత్తూ రంపపు మిషన్ తగలడంతో శనివారం ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కె. నాగులాపురం ఎస్ఐ సోమ్లానాయక్ తెలిపిన వివరాల మేరకు.. సల్కాపురం గ్రామానికి చెందిన పింజరి మిన్నెల్ల (63) కట్టెలు కొట్టుకుని జీవిస్తున్నాడు. రోజూ మాదిరిగానే గ్రామ సమీపంలో కల్లం దొడ్డిలో కట్టెలు కొట్టుకునేందుకు వెళ్లాడు. రంపపు మిషన్‌తో చెట్టు కొమ్మలు కొట్టి కిందకు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు రంపపు మిషన్ మెడకు తగలి గొంతు కోసేసింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.